క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల నేడు (మంగళవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కొత్తూరు, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దీప్తికి డాక్టరేట్



ఎంజీఎం : జిల్లాలోని ఓగ్లాపూర్‌లోని కేర్ కాలేజీ ఆఫ్ ఫార్మసీల్లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆర్.దీప్తి ఫార్మసీ విభాగంలో సమర్పించిన 'అడెనిన్-ప్రేరిత దీర్ఘకాలిక కిడ్నీ నష్టం, కార్డియోవాస్కులర్ ఆల్టరేషన్స్-టార్గెటింగ్ టీజీఎఫ్-బీటా 1 అండ్ కాస్పేస్ 3 ' అనే పరిశోధక గ్రంథానికి గాను విశాఖపట్నం గీతం యూనివర్సిటీ డాక్టరేట్ అందించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. గీతం విశ్వవిద్యాలయంలో ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.సుహాసిని పర్యవేక్షణలో దీప్తి ఈ పరిశోధన చేసినట్లు వివరించారు. దీప్తిని తోటి స్కాలర్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

నిమ్మల రాజేశ్‌కు..



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకుడు నిమ్మల రాజేశ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. హిస్టారికల్ మాన్యుమెంట్స్ ఇన్ నార్త్ తెలంగాణ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ టూరిజం – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రాజేష్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు టి దయాకర్‌రావు పర్యవేక్షణలో రాజేష్ తన పీహెచ్‌డీని పూర్తి చేశారు.

కేడీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు..



కేయూ క్యాంపస్ : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గణిత విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఇప్ప మంగమ్మకు హైదరాబాద్ మేడ్చల్‌లోని అనురాగ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆ యూనివర్సిటీలో గణిత విభాగంలో పరిశోధకురాలుగా న్యూమరికల్ సొల్యూషన్స్ ఆఫ్‌ఎంహెచ్‌డీ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ నానోఫ్లూయిడ్ ఫ్లో ప్రాబ్లెమ్స్ ఓవర్ ఏ స్ట్రెచింగ్ ష్రింకింగ్ సర్ఫేస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మంగమ్మకు డాక్టరేట్‌ను అనురాగ్ యూనివర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఎం ముత్తారెడ్డి ప్రదానం చేశారు. ప్రొఫెసర్ వై.ధర్మేందర్‌రెడ్డి పర్యవేక్షణలో మంగమ్మ తన పీహెచ్‌డీని పూర్తిచేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జైలు, జరిమానా

రామన్నపేట : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష, 27 మందికి రూ.29,800 జరిమానా విధిస్తూ జడ్జి అబ్బోజు వెంకటేశం తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి రూ.1500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు తెలిపారు.

బీటెక్ విద్యార్థినికి చేయూత



విద్యారణ్యపురి : బీటెక్ విద్యార్థినికి హనుమకొండలో విద్యాఫౌండేషన్ సభ్యురాలు వేదాంతలక్ష్మి రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. హైదరాబాద్‌లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న హనుమకొండకు చెందిన కోమల్లభవ్యశ్రీకి ఆ కళాశాల లైబ్రరీ ఫీజు నిమిత్తం సోమవారం అందజేశారని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిల్ల మహేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి కలకోట్ల నరేందర్, బాధ్యులు వెల్దండి లీల, టి.నర్సింగరావు, అనిత, కె.కృష్ణ,కూరపాటి రమేష్, వసంత పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

న్యూశాయంపేట : నగరంలోని 14వ డివిజన్ పరిధిలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇవ్వాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతెయాజ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. డివిజన్ పరిధిలోని ఏనుమాముల, ఎన్‌టీఆర్‌నగర్, ఎస్ ఆర్‌నగర్, సుందరయ్యనగర్, ఇందిరమ్మ కాలనీ, ఫేస్‌వన్, ఫేస్‌టూ రెడ్డిపాలెం తదితర కాలనీల నిరుపేదలు అర్హులు ఉన్నా సర్వేకు బల్దియా అధికారులు సర్వేకు రావడం లేదన్నారు. రాజేందర్, స్టాలిన్, సంతోష్, లింగస్వామి, కుమార్, సురేందర్, శివ పాల్గొన్నారు.

'పీఎం కుసుం'పై విచారణ

- సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై ఇంటెలిజెన్స్ వివరాల సేకరణ
- 100కు పైగా ప్రశ్నలతో దరఖాస్తుదారుల వద్దకు..
- ఆంతర్యమేమిటని సందేహిస్తున్న రైతులు
- భారీ పెట్టుబడి కావడంతో పథకంపై పలువురి అనాసక్తి

ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు : 682
చెల్లించిన ఈఎండీలు : 162
లెటర్ ఆఫ్ ఆక్సెప్టెన్సీ జారీ : 141
ముందుకు రాని రైతులు : 520 మంది

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై రైతులను ప్రోత్సహించేందుకు తీసుకువచ్చిన ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్(పీఎం కుసుం) పథకంపై ఇంటిలిజెన్స్ విచారణ చేపట్టింది. 100కు పైగా ప్రశ్నలతో ఇంటిలిజెన్స్ అధికారులు రైతులను నేరుగా కలిసి పీఎం కుసుం సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై వివరాలు సేకరిస్తున్నారు. కొంత మంది రైతులు ముందుకు వచ్చి వివరాలు వెల్లడిస్తుండగా, మరి కొందరు వివరాలు చెప్పడానికి ఇష్టపడడంలేదు. ఇంకొందరు దరఖాస్తు చేశాం కానీ.. సోలార్ ప్లాంట్ పెట్టుకోవడం లేదని చెబుతున్నారు. అయితే ఈఎండీ చెల్లించిన వారితో సంబంధం లేకుండా దరఖాస్తు చేసిన ప్రతీ రైతు నుంచి ఇంటిలిజెన్స్ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. దీంతో వివరాలు ఎందుకు సేకరిస్తున్నారు.. ఇందులో ఉన్న అంతర్యమేమిటని రైతులు సందేహిస్తున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో 682 అప్లికేషన్లు

రాష్ట్ర వ్యాప్తంగా 2,788.9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికిగాను సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు 2,098 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో స్త్రీ శక్తి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 2వేల మెఘా వాట్లా విద్యుత్ ఉత్పత్తికి దరఖాస్తు చేసింది. అయితే ఈనెల 4 నిర్ణీత గడువు వరకు 683.8 మెగావాట్లకు 520 మంది రైతులు ఈఎండీ చెల్లించారు. ఇందులో 561.7 మెగావాట్ల విద్యుత్ ఉత్పతికి 439 మందికి లెటర్ ఆఫ్ ఆక్సెప్టెన్సీ జారీ చేశారు. ఉమ్మడి వరంగల్‌లో 889.7 మెగావాట్లకు సరిపడా 682 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 210.6 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 162 మంది రూ.ఒక లక్ష చొప్పున ఈఎండీ చెల్లించారు. 177.1 మెగావాట్లకు 141 మందికి లెటర్ ఆఫ్ ఆక్సెప్టెన్సీ ఇచ్చారు. ఇంకా 520 మంది రైతులు సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై విముఖతతో ఉన్నారు.

అంత వ్యయం భరించలేమంటున్న రైతులు

ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు రూ.3 కోట్లు ఖర్చవుతుంది. ఇందులో రైతులు తమ వాటాగా 25 శాతం భరిస్తే, బ్యాంకుల ద్వారా 75 శాతం రుణ సదుపాయాన్ని కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే రూ.3 కోట్ల వ్యయంలో 25 శాతం వాటా కింద రూ.75 లక్షలు తాము భరించలేమని, దీనికి తోడు తమ భూమి నుంచి సబ్‌స్టేషన్ వరకు అయ్యే ఖర్చులు కూడా తమ వల్ల కాదని రైతులు చెప్పారు. ఈ అంశాన్ని ఇంటిలిజెన్స్ అధికారులకు కూడా వివరిస్తున్నట్లు పలువురు తెలిపారు.

వివరాల సేకరణ ఇలా..

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రైతుకు ఆర్థిక స్థోమత ఉందా? డెవలప్‌మెంట్‌కు ఇచ్చారా..? రైతు సొంతంగా ఏర్పాటు చేసుకుంటున్నాడా..? భారీ పెట్టుబడి కావడంతో రైతుల వెనుక ఎవరైనా ఉన్నారా..? రైతులకు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేంద పెట్టుబడి ఎక్కడి నుంచి వస్తుంది..? డెవలప్‌మెంట్‌కు ఇస్తే ఏ విధానంలో ఇచ్చారు..? రైతుకు ఎంత భూమి ఉంది.. ఎన్ని మెగావాట్ల సోలార్ ప్లాంట్, ఎన్ని ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు.. ఈ భూమి పంటకు అనుకూలమా కాదా.. బ్యాంకు నుంచి రుణం తీసుకుంటున్నారా.. రైతు వాటాగా భరించే స్థాయి ఉందా.. ఉంటే ఆ సొమ్ము ఏ విధంగా సమకూర్చుకుంటున్నారు.. పెట్టుబడి వచ్చే మార్గాలు ఏమిటీ.. తదితర వివరాలు అడుగుతున్నారని రైతులు తెలిపారు.

వీరసైనికులకు సలామ్



వరంగల్ చౌరస్తాలో తిరంగా యాత్ర ర్యాలీలో బీజేపీ, వివిధ సంఘాల నాయికులు

- కదం తొక్కిన వివిధ వర్గాల ప్రజలు
- త్రివర్ణమయమైన తిరంగా యాత్ర

వరంగల్ చౌరస్తా : ఆపరేషన్ సింధూర్‌తో తమ ప్రాణాలను లెక్క చేయకుండా పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టి, దాడులను తిప్పికొట్టిన వీర సైనికులకు అండగా మేం ఉన్నామంటూ వివిధ వర్గాల ప్రజలు గళమెత్తారు. సోమవారం సాయంత్రం వరంగల్ స్టేషన్ రోడ్డులోని పోస్టాఫీస్ సెంటర్ నుంచి చౌరస్తా, జేపీయస్ రోడ్డు, మండిబజారు మీదుగా పోచమ్మమైదాన్ వరకు సిటిజన్ ఫర్ నేషన్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. తిరంగా యాత్ర మువ్వెన్నెత్రివర్ణ జెండాలతో రెపరెపలాడింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదులు భారత్ వైపు కన్నెత్తి చూడకుండా జవాబిచ్చారన్నారు.ర్యాలీలో చిన్నారులు వీర జ వాన్లు, భారత మాత వేషాధారణలో అకట్టుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్ర దీప్ రావు, నాయకులు రత్నం కిషోర్ షా, వెంకట రమణ, వెంకట్ గౌడ్, ప్రభాకర్, రఘు నారెడ్డి, రంజిత్ కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద



ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



వరంగల్ : కొడుకుల నుంచి రక్షణ కల్పించాలని వినతిపత్రం అందజేస్తున్న వృద్ధ దంపతులు

హన్మకొండ అర్బన్ : ప్రజావాణిలో స్వీకరించిన వినతులను ఆయా శాఖ అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై మొత్తం 86 వినతులు వచ్చినట్లు చెప్పారు. వాటిని ఆయా శాఖ అధికారులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వై.వి గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, పరకాల ఆర్‌డీఓ నారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో దరఖాస్తుల స్వీకరణ

న్యూశాయంపేట: ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, వరంగల్ నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, డీఆర్డీఓ కౌసల్యాదేవి జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి వినతులు స్వీకరించారు. మొత్తం 128 వినతులు రాగా అందులో.. రెవెన్యూ 54, హౌసింగ్, మున్సిపాలిటీ 7, మిగతా శాఖలకు 67 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తాగునీటి సమస్య తదితర అంశాలపై యంత్రాంగం నిబద్ధతతో పని చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి అనురాధ, డీసీఓ నీరజ, డీపీఓ కల్పన, వరంగల్ తహసీల్దార్ ఎక్బాల్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మురికి కాల్వ క్లీన్



జేసీబీతో కాల్వ క్లీన్ చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

హసన్‌పర్తి : 5వ డివిజన్ భీమారంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ పక్కన రోడ్డు మురికి కాల్వను క్లీన్ చేశారు. 'మురికి కూపంగా రోడ్డు' అనే కథనం 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత జేసీబీ సాయంతో మురికి కాలువను శుభ్రం చేశారు. పైప్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్పొరేటర్ ప్రత్యేక నిధుల నుంచి పనులు చేపడుతున్నట్లు వివరించారు. సాంకేతిక కారణం వల్ల ఇక్కడ సమస్య ఏర్పడిందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషానాయక్, జవాన్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు సందర్శన



డ్యాన్స్ శిక్షణను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్

విద్యారణ్యపురి : వరంగల్‌లోని మట్వాడ హైస్కూల్‌లో విద్యార్థులకు సమ్మర్‌క్యాంపు కొనసాగుతోంది. క్యాంపు కేంద్రాన్ని రాష్ట్ర విద్యాశాఖ సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ పి.రాజీవ్, డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్‌తో కలిసి సోమవారం సందర్శించారు. విద్యార్థులు ఆర్ట్స్, క్రాఫ్ట్, డ్యాన్సులు, కరాటే, వివిధ క్రీడా పోటీలపై వలంటీర్లు శిక్షణ ఇస్తుండగా రాజీవ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్వహణపై రాజీవ్ సంతృప్తి వ్యక్తం చేశారని పాఠశాల హెచ్‌ఎం కె అరుణ, వేసవి శిక్షణ ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్ తెలిపారు. వరంగల్ ఇన్‌చార్జ్ ఎంఈఓ గంప అశోక్, వలంటీర్లు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి



కలెక్టరేట్ వద్ద సూర్జిత్‌సింగ్ నగర్ కాలనీ వాసులు

హన్మకొండ అర్బన్ : బాలసముద్రంలోని సూర్జిత్ సింగ్ నగర్‌లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న మాకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని ఖాళీ చేయించి ఇప్పటికీ కూడా వాటిని అందించలేదని వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని సూర్జిత్‌నగర్ వాసులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 10 ఏళ్లు గడుస్తున్నా ఇంకా లబ్ధిదారులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించకపోవడంతో కొంతమంది స్థానికంగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటుండగా, మరికొంతమంది స్థానికంగా కిరాయికి ఉండాల్సి వస్తుందన్నారు. అధికారులు జోక్యం చేసుకొని వెంటనే లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని కాలనీవాసులు కోరారు.

ఇంజనీరింగ్ కళాశాలల ఫీజులు తగ్గించాలి

- ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు సుజిత్



సమావేశంలో మాట్లాడుతున్న సుజిత్

హన్మకొండ అర్బన్ : రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశాలల ఫీజులను వెంటనే తగ్గించాలని ఏబీవీపీ రాష్ట్రసమితి సభ్యుడు ఆరేపల్లి సుజిత్ అన్నారు. ఏబీవీపీ హనుమకొండ జిల్లా శాఖ అధ్వర్యంలో సోమవారం బాలసముద్రంలోని సామా జగన్ మోహన్ మెమోరియల్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో మూడేళ్లకోసారి పెరిగే ఇంజనీరింగ్ కళాశాల ఫీజులను ఇష్టానుసారంగా పెంచడానికి ప్రతిపాదనలు పంపిన టీఏఎఫ్ఆర్‌సీ ఈ నిర్ణయాన్ని ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. కళాశాలల టీచింగ్, నాన్ టీచింగ్, లైబ్రరీ, ల్యాబ్స్ ఇలా ఎటువంటి వసతులు లేకున్నా తప్పుడు లెక్కలు చూపిస్తూ ఇష్టానుసారంగా దోచుకోవడానికి సిద్ధమయ్యాయన్నారు. వెంటనే ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి పేద విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య అందుబాటులో ఉండే విధంగా ఫీజులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ వరంగల్ మహానగర కార్యదర్శి తాళ్లపల్లి అరుణ్, జోనల్ ఇన్‌చార్జ్ హరి, శ్రీశాంత్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

విద్యారణ్యపురి: మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించే యోచనను విరమించుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. ఈమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో హనుమకొండ డీఈఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి అనంతరం, డీఈఓ వాసంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, గ్రామిక మహిళా కన్వీనర్ నిడికొండ రజిత, సీఐ టీయూ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ బాధ్యులు నికిత, సరిత, విజయ, పర్వీన్, లక్ష్మి, కరుణ, లావణ్య, అరుణ, దీపిక, మమత, అనిత, సంధ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సెమినార్ నివేదిక అందజేత



బాలక్రిష్టారెడ్డికి నివేదిక అందజేస్తున్న వెంకట్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ ఏడాది మార్చిలో 'దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు – ప్రాధాన్యత' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. సెమినార్‌కు వచ్చిన పరిశోధన పత్రాలను నివేదికగా రూపొందించింది. ఈ మేరకు ఆ నివేదిక పుస్తకాన్ని హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్టారెడ్డి, ఐసీఎస్ ఎస్ ఆర్ ఎస్ఆర్‌సీ కార్యాలయంలో డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌కు పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, అధ్యాపకులు సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో బీఓఎస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణ, అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వాడపెల్లి నాగరాజు, స్కాలర్ అంకెళ్ల శంకర్ పాల్గొన్నారు.

పిడుగు పడి పాడి ఆవులు మృతి

ఖిలా వరంగల్ : ఉరుములు మెరుపులతో కూడిన వర్షం సోమవారం సాయంత్రం పడగా పిడుగు పడి రెండు పాడి ఆవులు అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన సోమవారం సాయంత్రం మధ్యకోట మ్యూజియం వెనక మొండిచింత చెట్టుకింద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పడమరకోటకు చెందిన తోట జగన్ రైతు మధ్యకోట మ్యూజియం వెనుక భాగాన ఉన్న తన వ్యవసాయ బావి వద్ద రెండు ఆవులను మేతకు తీసుకెళ్లాడు. ఆవులు మొండిచింత చెట్టుకింద కట్టేసి ఇంటికి భోజనానికి వచ్చాడు. సాయంత్రం అకస్మికంగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం, పిడుగు పాటుతో ఆవులు అక్కడికక్కడే దుర్మరణం చెందాయి.

సంక్షిప్త సమాచారం

చట్టాలపై అవగాహన ఉండాలి

మడికొండ : చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. సోమవారం మడికొండలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీదేవి, అనూష సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశాలను, సెంటర్ అందించిన సేవలు వివరించారు.

రైల్వే ఏడీఈఎన్ నరసింహారావుకు సన్మానం

కాజీపేట రూరల్ : కాజీపేట ఫాతిమానగర్ బైపాస్ లేన్‌లోని రైల్వే టీటీ మిషన్ శాటిలైట్ డిపో ఏడీఈఎన్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన నరసింహా రావును సోమవారం రైల్వే, శాటిలైట్ డిపో రైల్వేసిబ్బంది శాలువా, పూలబొకేలతో సన్మానించారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎంజీఎం : వరంగల్ కాకతీయ థియేటర్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మొదట కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఆటో, సైకిల్ రిక్షాను ఢీకొన్న ఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పోతననగర్‌కు చెందిన పోశాలు తలకు, భవానినగర్‌కు చెందిన సతీష్‌శర్మకు తీవ్ర గాయాలయ్యాయి. మట్టెవాడ పోలీసులు, స్థానికులు చికిత్స నిమిత్తం బాధితులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఏసీపీని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

హన్మకొండ: కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డిని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి కలిశారు. ఏసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కార్యాలయంలో ప్రశాంత్‌రెడ్డిని సంతోష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు.

కాజీపేట అర్బన్ : కాజీపేట ఏసీపీగా నూతనంగా బాధ్యతలను స్వీకరించిన ప్రశాంత్‌రెడ్డిని సోమవారం 44వ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప అభివృద్ధి కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

ఖిలా వరంగల్: తల్లికి కొడుకు తలకొరివి పెట్టకుండా మొఖం చాటేయగా..కుమార్తె అన్ని తానై తల్లికి దహన సంస్కారాలు నిర్వహించిన ఘటన సోమవారం ఉదయం కరీమాబాద్‌లో చోటు చేసుకుంది. కరీమాబాద్ లక్ష్మీనగర్ తారకరామ కాలనీ చెందిన రాచర్ల నాగమ్మ (70)కు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు మృతి చెందగా.. చిన్నకుమారుడు ఇంటిని తన భార్యపై మార్చేసుకొని తల్లిని ఇంటి నుంచి గెంటేశారు. సోమవారం ఉదయం నాగమ్మ మృతి చెందగా..కుమార్తెలు తన అన్న రాజ్‌కుమార్ సమాచారం అందజేసినా దహన సంస్కారాలు నిర్వహించేందుకు మొఖం చాటేశారు. చిన్న కుమార్తె శివ జ్యోతి తలకొరివి పెట్టి తల్లి రుణం తీర్చుకుంది.

ప్రైవేట్ హాస్పిటల్‌పై చర్య తీసుకోవాలి

హన్మకొండ అర్బన్ : వైద్యం పేరుతో ప్రజలను దోచుకుంటున్న ప్రైవేట్ హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నోముల కిషోర్, తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రైవేట్ హాస్పిటళ్ల తీరుపై హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

అంజన్నకు క్షీరాభిషేకం

కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లో కొలువు దీరిన దక్షిణ ముఖ అభయాంజనేయ స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ అంజన్నకు 108 లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం నిర్వహించారు.

తల్లిదండ్రులకు మైనర్ల అప్పగింత

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం న్యూశాయంపేటలో ఆదివారం మైనర్ల పెళ్లిని సుబేదారి పోలీసులు అడ్డుకుని సీడబ్ల్యూసీకి మైనర్లను కౌన్సిలింగ్ నిమిత్తం అప్పగించిన సంగతి విదితమే. సోమవారం సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో మైనర్లతో పాటు తల్లిదండ్రులను సుబేదారిలోని బాల రక్షభవన్ కార్యాలయానికి పిలిపించి బాల్యవివాహాలు, బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం మైనర్లను తల్లిదండ్రులకు అప్పగించారు.

పేకాటస్థావరంపై దాడులు

హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురంలోని ఓ ప్రాంతంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఓ హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు మరో ముగ్గురిని సిబ్బంది అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.52,900 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం ఎల్‌ఐసీ కాలనీలోని దొనికెల రవికుమార్ ఇంటిలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నిందితులు హెడ్ కానిస్టేబుల్ ఆర్.పాపయ్య, రవికుమార్, హనుమకొండ శ్రీనర్‌కాలనీకి చెందిన కేశిరెడ్డి వివేకానందరెడ్డి, విద్యారణ్యపురికి చెందిన నాగేశ్వర్‌రావును అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ వివరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. జింక మృతి

మామునూరు: నీళ్లు తాగేందుకు చెరువు వైపునకు పరిగెడుతున్న జింకను ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అది అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు చెరువు కట్ట వద్ద సోమవారం చోటు చేసుకోంది. స్థానికుల కథనం ప్రకారం.. మామునూరు టీజీటీఎస్పీ, ఎయిర్‌ఫోర్ట్ పరిసరాలు, పశుపరిశోధన స్థానం అటవీ భూముల్లో నిర్జన ప్రదేశాలు ఎక్కువగా ఉన్నాయి. వాటిలో జింకలు, ఇతర అటవీ జంతువులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. సోమవారం తెల్లవారుజామున మామునూరు చెరువు వద్దకు నీటి కోసం వెళ్తున్న జింకను రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అది మృతిచెందింది. పోలీసుల పర్యవేక్షణలో పశువైద్య అధికారులు, అటవీశాఖ అధికారుల సంయుక్తంగా పోస్టుమార్టం నిర్వహించి చెరువులో గొయ్యి తీసి జింక కళేబరాన్ని ఖననం చేశారు.

సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకం

సుందరయ్య జీవితం మార్గదర్శకం, స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య, పలువురు వక్తలు అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఖిలావరంగల్, కేయూలో, కా జీపేటలో, హనుమకొండలోని రాంనగర్ కార్యా లయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాల్యం నుంచే అభ్యుదయ భావాలను పునికి పుచ్చుకున్నారని అన్నారు. కుటుంబపరంగా తన వాటాగా వ చ్చిన ఆస్తిని పేద ప్రజల కోసం అర్పించిన మహనీయుడని కొనియాడారు. సమావేశంలో సీపీఎం నేతలు, అసిస్టెంట్ ప్రొఫెసర్, టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి,నెట్‌వర్క్



ఖిలావరంగల్ : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు



కేయూలో నివాళులర్పిస్తున్న టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులు



కాజీపేట అర్బన్ : న్యూశాయంపేటలో..



న్యూశాయంపేట : రాంనగర్‌లో..